క్లుప్తంగా

షార్ట్ సర్క్యూట్‌తో జేసీబీ దగ్ధం



లారీపై తరలిస్తుండగా షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమవుతున్న జేసీబీ

కుక్కునూరు: షార్ట్ సర్క్యూట్ కారణంగా జేసీబీ దగ్ధమైన ఘటన ఆదివారం మండలంలోని వింజరం గ్రామం వద్ద చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకుడు, కుక్కునూరు వైస్ ఎంపీపీ తాండ్ర రాజేష్‌కు చెందిన జేసీబీని లారీలో తరలిస్తుండగా వింజరం గ్రామం వద్ద బ్యాటరీలో షార్ట్ సర్క్యూట్‌తో పొగలు వ్యాపించి జేసీబీకి మంటలు అంటుకున్నాయి. గాలికి మంటలు ఎక్కువ కావడంతో లారీ వెనకాల వస్తున్న వాహనదారులు గమనించి లారీ డ్రైవర్ అప్రమత్తం చేశారు. వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో ఫైర్‌సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళం



దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు సోమవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. కొమరవరానికి చెందిన ఎం.లక్ష్మీనారాయణ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ మద్దాల శ్రీను విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

నేటినుంచి గ్రంథాలయ వారోత్సవాలు

జంగారెడ్డిగూడెం రూరల్: గ్రంథాలయాల వారోత్సావాల్లో నిర్వహించే శిక్షణ కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సర్పంచ్ గెల్లా వెంకట రమణ అన్నారు. మండలంలోని లక్కవరం శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వతేదీ వరకు నిర్వహించనున్న గ్రంథాలయ వారోత్సవాల కార్యక్రమ పోస్టర్‌ను సర్పంచ్ వెంకట రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రంథపాలకుడు ఎం.రియాజ్ మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా డ్రాయింగ్ పోటీలు, వక్తృత్వ పోటీలు, ముగ్గుల పోటీలు, పుస్తక పఠనం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం 56వ శాఖ గ్రంథాలయ వారోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు లైబ్రేరియన్ యు రాముడు పేర్కొన్నారు. ఈనెల 19వ తేదీ వరకు బాలలకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రారంభ రోజు సందర్భంగా 14వ తేదీ ఉదయం సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి చేతుల మీదుగా జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని అన్నారు.

ప్రజారక్షణ భేరిని విజయవంతం చేయాలి

కొయ్యలగూడెం: విజయవాడలో ఈనెల 15న నిర్వహించే ప్రజా రక్షణభేరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు రాంబాబు సోమవారం ప్రకటనలో పిలుపునిచ్చారు. బీఆర్‌టీఎస్ రోడ్డు ఫుడ్ జంక్షన్ నుంచి ఆరోజు ఉదయం 10 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి చేస్తున్న అన్యాయంపై ఈ ర్యాలీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీపీఐఎం రాష్ట్ర కార్యదర్శి సీతారాం ఏచూరి, జాతీయ సీపీఎం ప్రధాన కార్యదర్శి బీవీ రాఘవులు, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు ఎంఏ గఫూర్, కేంద్ర కమిటీ సభ్యులు పి.మధు హాజరవుతున్నారన్నారు.

రేపు టీడీఎస్‌పై అవగాహన సదస్సు

జంగారెడ్డిగూడెం: స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 15వ తేదీన టీడీఎస్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వర రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఇన్‌కమ్‌టాక్స్ అధికారి ఎస్.శ్రీనివాస రావు సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొని టీడీఎస్‌పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. వ్యాపారులు, వర్తక సంఘాల ప్రతినిధులు హాజరై టీడీఎస్‌పై ఉన్న సమస్యలు, సందేహాలను నివృత్తి చేసుకోవాలని కోరారు.

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని 8వ సచివాలయం పరిధిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మంగళవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జంగారెడ్డిగూడెం పట్టణ కమిటీ అధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, పట్టణ జేసీఎస్ కన్వీనర్ చనమాల శ్రీనివాస్, పట్టణ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ అచ్యుతరామయ్య ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు.

కార్తీక మహోత్సవాలకు ముస్తాబు

- నేటినుంచి మద్దిలో కార్తీక ఉత్సవాలు ప్రారంభం
- ఏర్పాట్లు పరిశీలించిన ఉప కమిషనర్
- విద్యుత్ దీపాలంకరణలో శోభాయామానంగా క్షేత్రం



మద్దిలో ఏర్పాట్లను పరిశీలించిన దేవదాయ శాఖ ఉప కమిషనర్ విజయరాజు



విద్యుత్ దీపాలంకరణలతో శోభిల్లుతున్న క్షేత్రం

జంగారెడ్డిగూడెం రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రం కార్తీక మాస మహోత్సవాలకు ముస్తాబవుతోంది. ఏర్పాట్లను దేవదాయ శాఖ ఉప కమిషనర్ మేడేపల్లి విజయరాజు, ఏలూరు జిల్లా దేవదాయ శాఖాధికారి సీహెచ్ రంగారావు పరిశీలించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో ఆకుల కొండలరావు, ఉప కమిషనర్ విజయరాజుకి వివరించారు. ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, ఎంపీ కోటగిరి శ్రీధర్ పాల్గొంటారని ఈవో తెలిపారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాట్లు, ప్రతి భక్తునికి అన్నప్రసాదం అందేలా పందిళ్ల ఏర్పాట్లు, ప్రత్యేక టిక్కెట్, ప్రసాదాల కౌంటర్ల ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగులకు ర్యాంప్ మీదుగా దర్శనం చేసుకునేలా వీల్‌చైర్ల సౌకర్యాలను కల్పిస్తున్నారు. అలాగే ప్రత్యేక ఆర్టీసీ బస్సు సౌకర్యాలను కల్పించారు. చిన్నారులకు పాలు పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుత్ దీపాలంకరణలో క్షేత్రం శోభాయామనంగా కనువిందు చేస్తోంది.

కార్తీక మాసంలో స్వామికి జరిగే కార్యక్రమాలు
- ప్రతి సోమవారం లక్ష తమలపాకులతో పూజలు
- ప్రతి బుధవారం లక్ష పూలతో లక్షార్చన
- ప్రతి ఆదివారం సువర్చలా హనుమద్ కల్యాణం
- ఈనెల 22న స్వామివారి గ్రామోత్సవం, ఉపాలయంలో శ్రీవారి కల్యాణం
- ఈనెల 16 నుంచి 23 వరకు 30వ వార్షిక సప్తాహాలు
- ఈనెల 14 నుంచి 16 వరకు హనుమాన్ మండల దీక్షలు ప్రారంభం
- డిసెంబర్ 10న పుష్కరిణిలో స్వామి వారి తెప్పోత్సవం
- డిసెంబర్ 1 నుంచి 3 వరకు హనుమాన్ అర్ధ మండల దీక్షలు
- డిసెంబర్ 26న హనుమాన్ దీక్షల ఇరుముడి సమర్పణ (పూర్ణాహుతి)

ఏజెన్సీలో దీపావళి పండుగ వేడుకలు



దుద్దుకూరులో మతాబులు కాల్చుతున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: దీపావళి పండుగ వేడుకలను ఏజెన్సీ ప్రాంతంలో ఘనంగా నిర్వహించారు. సాయంత్రం వేళ ఇళ్లల్లో దీపాలు వెలిగించుకుని లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పిల్లలు, పెద్దలు టపాసులు కాల్చి ఆనందంగా గడిపారు. మండలంలోని దుద్దుకూరులో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దీపావళి మతాబులు, టపాసులు పేల్చి సందడి చేశారు.

సాగిపాడు రహదారి నిర్మాణానికి శ్రీకారం

రూ.8 లక్షలు మంజూరు చేసిన ఎమ్మెల్యే ఎలీజా



సాగిపాడు రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

కామవరపుకోట: చింతలపూడి ఎమ్మెల్యే ఎలీజా తన సొంత నిధులతో మండలంలోని సాగిపాడు రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గత కొన్నేళ్లుగా కళ్ళచెరువు వెళ్లే ప్రధాన రహదారి నుంచి సాగిపాడు వరకు రహదారి అధ్వానంగా ఉండటంతో గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విషయాన్ని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి రూ.8 లక్షలు తన సొంత నిధులతో సుమారు 6 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. సోమవారం ఆయన రహదారి నిర్మాణ పనులను పరిశీలించారు. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే ఎలీజాకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ, గత టీడీపీ ప్రభుత్వం హయంలో రాష్ట్రంలోని అన్ని రహదారుల నిర్మాణాలను గాలికి వదిలేశారని, కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర ప్రజలకు సంక్షేమం ఫలాలు అందిస్తూ, రాష్ట్రంలో అన్ని రహదారులు ఆధునీకరించే దిశగా శ్రీకారం చుట్టారని అన్నారు. ఎమ్మెల్యేగా తాను పదవి చేపట్టిన నాటి నుంచి చింతలపూడి నియోజకవర్గం అభివృద్ధికి అవిశ్రాంతంగా కృషిచేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. నియోజకవర్గానికి ఎటువంటి అభివృద్ధి కార్యక్రమం అవసరమైనా జిల్లా స్థాయి అధికారుల నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరకు ప్రతి ఒక్కరిని కలుసుకుని పరిస్థితిని, వివరించి, అవసరమైన నిధులు తీసుకువస్తున్నానని తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో జంగారెడ్డిగూడెం, చింతలపూడి మున్సిపాలిటీలతో పాటు, మండల కేంద్రాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. గ్రామాల్లో సైతం మౌలిక వసతుల కల్పనే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తున్నట్లు వివరించారు.15 ఏళ్ల క్రితం వేసిన రోడ్డు అధ్వాన్నంగా మారడంతో ఎన్నికల సమయంలో ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. నియోజకవర్గంలో ప్రాధాన్యతా క్రమంలో అన్ని పనులు చేసుకుని వస్తున్నామన్నారు. అయితే గ్రామస్తులు మరోసారి రోడ్డు పరిస్థితిని తన దృష్టికి తీసుకురావడంతో తన సొంత నిధులు వెచ్చించి రోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో మండలంలోని రహదారుల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగిపాడు గ్రామ సర్పంచ్ గుండుగోలు సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడత రమేష్ బాబు, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, తడికలపూడి సచివాలయ కన్వీనర్ వెద్రి శ్రీను, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

దళిత ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం



మేడ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కొయ్యలగూడెం: దళిత ఉద్యోగుల సంక్షేమ అభివృద్ధి తమ ధ్యేయమని (మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత ఎంప్లాయిస్) మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ అన్నారు. సోమవారం ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు లాగు జయరాజ్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో పోలవరం నియోజకవర్గ కమిటీని ప్రకటించారు. నూతనంగా ఎన్నికైన కమిటీకి దేవపాల్ నియామక పత్రాలను అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షునిగా కొక్కిరపాటి మధు, ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా లాగు జయరాజు, ప్రధాన కార్యదర్శి జుజ్జువరపు రంగారావు, ఏలూరు పట్టణ శాఖ అధ్యక్షుడిగా గండిపాము శ్యాంబాబు, ప్రధాన కార్యదర్శిగా కడియాల పెద్దిరాజు, పోలవరం నియోజకవర్గం అధ్యక్షుడిగా కూనపోము సూర్య, ప్రధాన కార్యదర్శిగా మిరియాల రవికుమార్, ఉంగుటూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా వసంతాడ రమేష్, ప్రధాన కార్యదర్శిగా పెద్దిరాజు, చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షుడిగా ఈడుగుల ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డోలా రాజారావు, దెందులూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా పోలా రవి, నూజివీడు నియోజకవర్గ అధ్యక్షుడిగా రాము రమేష్, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ జాకోబ్‌లను నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్ వ్యవస్థాపకుడు శృంగారపాటి శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి పొన్నూరు శ్యామ్ సామ్యూల్ జాబ్, ఉపాధ్యక్షురాలు పి.రాజ్యలక్ష్మి, రాష్ట్ర నాయకులు కూనపోము రాజరత్నం, కె.మధు, కె.సూర్య, కె.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో ర్యాంపుల ఏర్పాటు



ర్యాంపుల పనులు పరిశీలిస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్: కార్తీకమాసం సందర్భంగా భక్తులు గోదావరి నది స్నానానికి వెళ్లేందుకు వీలుగా పోలవరం గ్రామంలో ర్యాంపులు ఏర్పాటు చేశారు. గత రెండు రోజులుగా ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి పంచాయతీ పరిధిలోని పెదరామాలయం, చిన రామాలయం, ఆంజనేయస్వామి ఆలయం, నూతనగూడెం ప్రాంతాల్లో స్నాన ఘట్టాలకు వీలుగా ర్యాంపు నిర్మాణం పనులు చేపట్టారు. నదికి వెళ్లేందుకు ఎక్కి దిగేందుకు వీలుగా జేసీబీ సహాయంతో ఈ పనులు చేపట్టారు. భక్తులు తెల్లవారుజామున ఇబ్బంది పడకుండా గ్రామ పంచాయతీ వీధి లైట్లను ఏర్పాటు చేశారు. పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ర్యాంపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయించారు. అలాగే పట్టిసీమ, కొత్తపట్టిసీమ, గూటాల పంచాయతీల పరిధిలో కూడా ర్యాంపుల వద్ద సంబంధిత పంచాయతీ విద్యుత్ లైట్లను కూడా ఏర్పాటు చేశారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు పాడుం శ్యామ్ ఉన్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఆవులు మృతి



మృతి చెందిన ఆవును పరిశీలిస్తున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: మండలంలోని వెంకటకృష్ణాపురంలో విద్యుదాఘాతానికి గురై రెండు ఆవులు సోమవారం తెల్లవారుజామున మృతి చెందాయి. వివరాల ప్రకారం. గ్రామానికి చెందిన కౌలు రైతు గెద్దం రవీంద్ర తన ఆవులు, గేదెలను రోజు వలె గ్రామ శివారులోని ఆయిల్‌పామ్ తోటలో ఆదివారం సాయంత్రం కట్టివేశాడు. అయితే తెల్లవారుజామున ఒక విద్యుత్ స్తంభం వద్ద షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో రెండు పాడి ఆవులు విద్యుదఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాయి. దాంతో రైతు రవీంద్ర బోరున విలపించాడు. విషయం తెలుసుకున్న గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ఘటనా స్థలానికి చేరుకుని, బాధిత రైతును పరామర్శించారు. అలాగే ప్రమాదానికి గల కారణాలను విద్యుత్‌శాఖ ఏఈ నరసింహస్వామిని అడిగి తెలుసుకున్నారు. ఒక్కో ఆవు ధర రూ. 80 వేల వరకు ఉంటుందని, రైతుకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వెంకన్నబాబుతో కలసి బాధిత రైతుకు రూ. 10 వేలను ఆర్థిక సహాయంగా ఎమ్మెల్యే అందించారు. అనంతరం మండల పశువైద్యాధికారి అంగర సురేష్ ఆవులకు పోస్టుమార్టం నిర్వహించారు. రైతును పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, ఘంటా విఘ్నేశ్వరరావు, యలమర్తి గాంధి, యలమర్తి భాస్కరచౌదరి, గెద్దం దేవానందరావు తదితరులున్నారు.

కార్తీక మాస పూజలు ప్రారంభం



కుక్కునూరులోని శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆకాశదీపం నిర్వహిస్తున్న అర్చకులు




మక్కినవారిగూడెంలో విశేషాలంకరణలో దర్శనమిస్తున్న చంద్రశేఖరస్వామి

కుక్కునూరు: ఆలయాలలో కార్తీక మాసం పూజలు ప్రారంభమయ్యాయి. సోమవారం మధ్యాహ్నం నుంచి పాడ్యమి తిథి రావడంతో సోమవారం సాయంత్రం కార్తీక మాసం ప్రారంభంగా ఆలయాలలో ఆకాశ దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: అత్యంత విశిష్టమైన మాసాలలో ఒకటైన కార్తీకమాసం మంగళవారం నుంచి ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో శైవక్షేత్రాలతో పాటు వైష్ణవ క్షేత్రాలు, అమ్మవార్ల ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. మండలంలోని ఆలయాలు కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేకంగా అలంకరింపబడ్డాయి. బయ్యన్నగూడెంలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద, కన్నాపురంలోని పులిరామన్నగూడెం రోడ్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

టి.నరసాపురం: కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా టి.నరసాపురం మండలంలోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం శివాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. టి.నరసాపురం కాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయం, మక్కినవారిగూడెం చంద్రశేఖరస్వామి, రాజుపోతేపల్లి శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. ఆయా ఆలయాల్లో సోమవారం సాయంత్రం ధ్వజస్తంభం వద్ద ఆకాశ దీపాలను వెలగించారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఊటుకూరికి పురస్కారం



డాక్టర్ ఊటుకూరిని సన్మానిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: డాక్టర్ ఊటుకూరి వరప్రసాదను క్రైస్తవ సాహిత్య అకాడమీ ఘనంగా సత్కరించింది. విజయవాడ కేంద్రంగా పనిచేస్తున్న సాహిత్య అకాడమీ సమాజంలో వివిధ రంగాలలో విశేష కృషి చేసిన వారిని గుర్తించి ఏటా రాష్ట్ర ప్రభుత్వంలోని మంత్రివర్గానికి చెందిన పలువురి ప్రముఖుల చేత సత్కారం నిర్వహింప చేస్తూ వస్తోంది. ఈ నేపథ్యంలో బోడిగూడెం గ్రామం జెడ్పీ హైస్కూల్లో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న ప్రసాద్‌ని ఘనంగా సత్కరించింది. సాహిత్య రంగంలో విశేష సేవలందిస్తున్న కొయ్యలగూడెం పట్టణానికి చెందిన ప్రముఖ కవి, విమర్శకుడు అయిన వరప్రసాద్‌కు జాతీయ వచన రచన సామ్రాట్ పురస్కారంతో సన్మానించారు. ఠాగూర్ గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి చేతులమీదుగా అవార్డు స్వీకరించారు.

స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం: ప్రజల నుంచి అధిక మొత్తంలో సొమ్ములు వసూలు చేస్తున్న పట్టణంలోని ఒక స్కానింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కానింగ్ సెంటర్ వారు రోగుల వద్ద నుంచి రూ.1000 నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. దీనికి రశీదులు కూడా ఇవ్వడం లేదన్నారు. ఈనెల 4వ తేదీన ఆదివాసీ గిరిజన మహిళలు పూనెం పార్వతి, పొట్టా బుల్లెంకమ్మ గాయాలపాలై ప్రభుత్వాసుపత్రి వచ్చారని, వారికి ఎక్సరేలు, స్కానింగ్‌ల నిమిత్తం స్కానింగ్ సెంటర్‌కు రిఫర్ చేశారన్నారు. అక్కడ వీరి నుంచి రూ.10 వేల వరకు వసూలు చేశారని, ఇంత వరకు వాటికి సంబంధించిన రశీదులు ఇవ్వలేదన్నారు. అడిగితే డాక్టర్లు సంతకం పెట్టలేదని, రేపు రండి అని పేర్కొంటున్నారని తెలిపారు. ఈవిషయంపై ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి సదరు స్కానింగ్ సెంటర్ డాక్టర్లు, సిబ్బంది, యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఎస్.సుందరరావు, కె.సుందరరావు, బి.ఏసు, పి.సుబ్రహ్మణ్యం, పి.రమేష్, తలారి ప్రకాష్, కె.విజయశాంతి, జి.మేరీ, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

18న బాలోత్సవం సన్నాహక సమావేశం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణం, మండలానికి చెందిన రెండో తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు డిసెంబర్ 30వ తేదీన నిర్వహించనున్న బాలోత్సవం కోసం నవంబర్ 18వ తేదీ సాయంత్రం నాలుగున్నర గంటలకు సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆహ్వాన సంఘం కమిటీ తరఫున డాక్టర్ కె.వజ్రకిరణ్, ఐనాల వెంకటరమణ మూర్తి, తాడిసెట్టి వెంకన్నబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీ మాల్ ప్రక్క సందులోని డాక్టర్ వజ్ర కిరణ్ ఇంటి వద్ద ఈ సమావేశం జరుగుతుందని బాలోత్సవం కమిటీ తెలిపింది. సన్నాహక సమావేశానికి ఉభయ గోదావరి జిల్లాల టీచర్స్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ, మానవతా జిల్లా పూర్వ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు, హేలాపురి బాలోత్సవం కమిటీ నిర్వాహక కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అతిథులుగా హాజరవుతారని తెలిపారు. జంగారెడ్డిగూడెంలోని వివిధ సంస్థలు, విద్యాలయాల సంఘాల ప్రతినిధులు, పిల్లల ప్రేమికులు ఈ సమావేశానికి హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

నేడు దాచారంలో 'పల్లెకు పోదాం'

కుక్కునూరు: దాచారం సచివాలయ పరిధిలో మంగళవారం పల్లెకి పోదాం, గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలలో పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పాల్గొంటారని కుక్కునూరు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహారాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రథమ మహాసభ

జంగారెడ్డిగూడెం: ఈ నెల 14న ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ జంగారెడ్డిగూడెంలో నిర్వహిస్తున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి జేవీ రమణరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని చిట్టూరి గణేశ్వరరావు టౌన్‌హాల్‌లో మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుందని, ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దుర్గా భవాని, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పాల్గొంటారన్నారు. కావున మహిళా సమాఖ్య సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వ్యక్తిపై కేసు నమోదు

టి.నరసాపురం: అనుమతులు లేకుండా దీపావళి బాణసంచా సామగ్రిని విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.సురేంద్ర కుమార్ తెలిపారు. మల్లుకుంట గ్రామంలో అనుమతులు లేకుండా దీపావళి బాణసంచా సామగ్రి విక్రయిస్తున్నారనే సమాచారంతో తన సిబ్బందితో ఆదివారం దాడి చేసినట్లు చెప్పారు. ఈ దాడిలో బాణసంచా విక్రయిస్తున్న బొర్రంపాలెం గ్రామానికి చెందిన మాటూరి ధర్మసురేష్ నుంచి రూ.15,327 విలువ చేసే బాణసంచా సామగ్రి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి.. 10 మంది అరెస్ట్

ద్వారకాతిరుమల: మండలంలోని జి.కొత్తపల్లి గ్రామ శివారులోని ఒక పామాయిల్ తోటలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఆదివారం దాడి చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఈ దాడిలో 10 మంది జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.37,100 నగదుతో పాటు, 7 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు, ఏలూరు డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, భీమడోలు సీఐ బి.రవికుమార్ ఆధ్వర్యంలో ఈ దాడి నిర్వహించినట్టు ఎస్సై తెలిపారు.